నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 27 నవంబర్ 2024 | KHAMMAM

# రాజ్యాంగంతోనే సమాన అవకాశాలు

- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : దేశంలో అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు దక్కుతున్నాయంటే అది రాజ్యాంగం కల్పించిన గొప్పతనమేనని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని భద్రాద్రి కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని మన రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే నేడు అందరూ ఫలాలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరాం, సీపీవో సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, వివిధ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

# పత్తి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

**సీసీఐ కేంద్రాల తనిఖీల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



ఆన్‌లైన్ వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం రూరల్, నవంబర్ 26 : సీసీఐ కేంద్రాలకు పత్తిని విక్రయానికి తీసుకొచ్చే రైతులను తేమ శాతం, నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని, నాణ్యమైన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. గుర్రాలపాడులోని జీఆర్ఆర్, తల్లంపాడులోని శ్రీబాలాజీ, పొన్నెకల్‌లోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లులను అదనపు కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. తేమ పరీక్షలను తనిఖీ చేయడంతోపాటు కొనుగోళ్లకు ఎంత సమయం తీసుకుంటుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 3,648 మంది రైతుల నుంచి 8,487 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద వేచి చూడకుండా ఉదయం తెచ్చిన పత్తిని అదేరోజు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పత్తిలో తేమ 8 శాతం ఉంటే క్వింటాల్ రూ.7,521 మద్దతు ధర వస్తుందని, ఒక్కో శాతం పెరిగితే రూ.75 చొప్పున క్వింటాల్‌కు తగ్గుతుందన్నారు. రైతులు నాణ్యమైన పంటను తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, సీసీఐ ప్రతినిధి అవినాశ్, మార్కెట్ కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, వీరాంజనేయులు, ఏఈవోలు అదర్శ్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కేసుల విచారణలో జాప్యం చేయొద్దు
- నేర సమీక్షలో భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, నవంబర్ 26 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు హెచ్చరించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో హేమచంద్రాపురంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' పద్ధతిలో నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేయొద్దన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి, పీడీఎస్ బియ్యం వంటి అక్రమ రవాణా, మట్కా, బెట్టింగ్ వంటి జూదాలను నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం జరిగే చేయాలన్నారు. అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్.సతీశ్‌కుమార్, చంద్రభాను, వి.రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, అన్ని సబ్ డివిజన్లు, వివిధ విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఒడిసిపట్టిన నీటిని సాగుకు వినియోగించాలి

**భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 26 : వర్షపు నీటిని ఒడిసిపట్టి పెరటి తోటలు, కూరగాయల సాగుకు ఆ నీటిని వినియోగించుకుని జీవనోపాధి పొందాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివాసీ గిరిజనులకు సూచించారు. భద్రాచలం ఐటీడీఏలోని కాన్ఫరెన్స్ హాల్‌లో భారత రూరల్ లవ్లీ వుడ్ ఫౌండేషన్, ఈజీఎస్ ద్వారా గిరిజనులకు ఉపయోగపడే వనరులపై మంగళవారం ఒరియంటేషన్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామసభల ద్వారా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు వారి పొలాల్లోనే నీటిని నిల్వ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. దుమ్ముగూడెం మండలం కొత్తూరు, పెద్దకమలాపురం, దబ్బనూతల, జిన్నెలగూడెం, మంగువాయిబాడువ గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కెనాల్, పెర్కులేషన్ ట్యాంకు పనులు చేయించడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చన్నారు. చర్ల, కరకగూడెం మండలాల్లో గిరిజన రైతులను గుర్తించి వ్యవసాయం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో డేవిడ్‌రాజు, ఎస్‌వో భాస్కర్, ఎస్‌పీడీసీ ఉదయ్‌కుమార్, భారత రూరల్ లవ్లీ వుడ్ బృందం సభ్యురాలు శిరీష, ఏపీఎంలు సుకన్య, బక్కయ్య, సాయినివర్మ తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం ఎప్పుడిస్తారు?

**కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో వైరా ఎమ్మెల్యేను ప్రశ్నించిన మహిళ**



వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను ప్రశ్నిస్తున్న మహిళ

కొణిజర్ల, నవంబర్ 26: 'కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం కూడా ఇస్తామన్నారు కదా? ఎప్పుడిస్తారు?' అంటూ వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఓ మహిళ ప్రశ్నించింది. ఈ పరిణామం ఖమ్మం జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ హాజరై లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ లబ్ధిదారురాలి బంధువైన స్థానిక మహిళ చింతల నారాయణమ్మ అక్కడకు చేరుకున్నారు. 'మీరు అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో తులం బంగారం కూడా ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు కదా? మరి ఎప్పుడు అందజేస్తారు?' అంటూ ప్రశ్నించింది. దీంతో ఒక్కసారిగా కంగుతున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు.. వెంటనే సదరు మహిళను వారించారు. ఇందుకు ఎమ్మెల్యే బదులిస్తూ.. 'ప్రస్తుతం రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్న నేపథ్యంలో బడ్జెట్‌ను అధిగమిస్తూ సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని అన్నారు. మొదటి ప్రాధాన్యంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని, త్వరలోనే తులం బంగారం ఇచ్చే విషయమై ప్రభుత్వం ఆలోచిస్తోందని సమాధానమిచ్చారు.

# దీక్షా దివస్‌కు తరలిరావాలి

**బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**



మణుగూరు టౌన్, నవంబర్ 26 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో ఈ నెల 29న చేపట్టనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఆ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉద్యమ సారథి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేపట్టిన దీక్షతోనే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని, దీనిని పురస్కరించుకుని దీక్షా దివస్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి 500 మందికి తగ్గకుండా హాజరుకావాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు, సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# తెలంగాణ చరిత్రపై.. చెరగని సంతకం కేసీఆర్

- మలిదశ ఉద్యమాన్ని మలుపుతిప్పిన స్వరాష్ట్ర సారథి
- ఉద్యమనేత కేసీఆర్ దీక్ష కారణంగానే రాష్ట్ర ఆవిర్భావం
- 29న దీక్షా దివస్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి
- ఖమ్మంలో బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో వక్తలు
- హాజరైన ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి, తాతా, నేతలు సండ్ర, లింగాల




మాట్లాడుతున్న దీక్షా దివస్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

**29న చేపట్టే కార్యక్రమాలు..**

- ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం.
- తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళులు.
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో రోగులకు పండ్ల పంపిణీ.
- దీక్షా దివస్ చరిత్ర, ప్రాముఖ్యతపై ఉద్యమకారులు, పార్టీ నాయకులతో పార్టీ జిల్లా కార్యాలయంలో సమావేశం.

ఖమ్మం, నవంబర్ 26 : తెలంగాణ చరిత్రపై చెరగని సంతకం కేసీఆర్‌దని వక్తలు పేర్కొన్నారు. మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఘనత స్వరాష్ట్ర సారథిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజు, తెలంగాణ చరిత్రలో చెరిగిపోని రోజు నవంబర్ 29 అని గుర్తు చేశారు. అదే దీక్షా దివస్ అని స్పష్టం చేశారు. అందుకని ఆ రోజు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా సన్నాహక సమావేశంలో పార్టీ నేతలు ప్రసంగించారు. సన్నాహక సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ నేతలు, ఉద్యమకారులు కొండబాల కోటేశ్వరరావు, బానోతు చంద్రావతి, కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, ఖమర్, పగడాల నాగరాజు, బెల్లం వేణు, లక్ష్మిరెడ్డి, బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, భాషబోయిన వీరన్న, పెంట్యాల పుల్లయ్య, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కనగాల వెంకటరావు, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, గుండ్లపల్లి శేషగిరిరావు, లింగనబోయిన సతీశ్, ఆసిఫ్ పాల్గొన్నారు.

**దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలి: తాతా**



పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు పిలుపునిచ్చారు. ఆ రోజు కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో..' అనే నినాదంతో తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్రాన్ని సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. నాడు కేసీఆర్ తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దీక్షా దివస్ పేరుతో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతోనే నాటి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని జ్ఞప్తికి తెచ్చారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని చేపట్టి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని వివరించారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదే కాదని స్పష్టం చేశారు. తెలంగాణ జాతిపితగా నిలిచిన కేసీఆర్‌ను ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి చులకన చేసి మాట్లాడడాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు

**ఖమ్మం గులాబీమయం కావాలి: తక్కెళ్లపల్లి**

ఖమ్మం జిల్లా ఉద్యమాల ఖిల్లా అని దీక్షా దివస్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు గుర్తు చేశారు. మలిదశ ఉద్యమాన్ని మలుపుతిప్పిన ఈ జిల్లా ఈ నెల 29 న జరిగే దీక్షా దివస్‌లో గులాబీమయం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఖమ్మం జిల్లాలో జరిగిన ప్రతి పోరాటంలోనూ తాను భాగస్వామిగా ఉన్నానని గుర్తు చేశారు. కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజు అప్పటి పాలకులు ఆయనను అరెస్టు చేసి ఖమ్మం తీసుకొచ్చారని జ్ఞప్తికి తెచ్చారు. ఉద్యమం ప్రభావం తక్కువగా ఉంటుందని అప్పటి పాలకులు భావించి ఇక్కడికి తీసుకొచ్చినప్పటికీ ఖమ్మం ఉద్యమ బిడ్డలు, న్యాయవాదులు, విద్యార్థులు తమ పోరాటం, సంఘీభావం ద్వారా వారికి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. చావు నోట్లో తల పెట్టి ఉద్యమించిన కేసీఆర్.. తాను చనిపోయినా తెలంగాణ ఇవ్వాలనే డిమాండ్‌తో దీక్ష చేపట్టారని వివరించారు. ఈ రోజున అధికారంలో ఉన్న నాయకుడూ ఏనాడు జై తెలంగాణ అనలేదని గుర్తుచేశారు.

**కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలి: సండ్ర**



దీక్షా దివస్ కార్యక్రమానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులతో సహా పాల్గొనాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో శ్రేణులు కదలివస్తారని తెలిపారు. మన నాయకుడు కేటీఆర్ ఇచ్చిన పిలుపును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# 29 నుంచి డిగ్రీ పరీక్షలు

- ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా
- మిగతా పరీక్షలన్నీ షెడ్యూల్ ప్రకారమే..
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 29 కేంద్రాలు
- కళాశాలలకు చేరిన హాల్‌టికెట్లు
- బంద్ విరమించుకున్న కళాశాలల యాజమాన్యాలు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 26 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 29వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. అసలు ఈ నెల 26వ తేదీ నుంచి పరీక్షలు జరగాల్సి ఉండగా కళాశాలల బంద్ నేపథ్యంలో రీ షెడ్యూల్ చేశారు. ప్రభుత్వం యాజమాన్యాలతో చేసిన చర్చల సందర్భంగా కళాశాలలు తెరిచి పరీక్షలు నిర్వహించేందుకు అంగీకరించారు. ఈ నెల 26, 27, 28వ తేదీల్లో జరగాల్సిన పరీక్షలను డిసెంబర్ 27, 28, 30వ తేదీల్లో నిర్వహించేలా సోమవారం సాయంత్రం కళాశాలలకు సమాచారం ఇచ్చింది. మిగిలిన పరీక్షలు మాత్రం గత షెడ్యూల్ ప్రకారం యధావిధిగా నిర్వహించనున్నారు. ఈ నెల 29న డిగ్రీ మూడో సెమిస్టర్‌తో పరీక్షలు ప్రారంభంకానున్నాయి. 1వ సెమిస్టర్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

**విద్యార్థులపై ప్రభావం..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ఈ విద్యాసంవత్సరంలో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు రెండు విడతలుగా బంద్ నిర్వహించాయి. దీంతో సుమారు 20రోజులపాటు విద్యార్థులు నష్టపోయారు. చాలా కళాశాలల్లో బోధన జరగకుండానే పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితి. ప్రభుత్వ తీరు వల్ల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడింది.

**ఉమ్మడి జిల్లాలో 29 కేంద్రాలు...**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డిగ్రీ కళాశాలల పరిధిలో 29 కేంద్రాల్లో జంబ్లింగ్ పద్ధతిలో పరీక్షలు జరుగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెంలో 14 కేంద్రాలు, ఖమ్మంలో 15 కేంద్రాలు ఉన్నాయి. యూనివర్సిటీ విభాగం గతంలో చేసిన తప్పిదాలే మళ్లీ చోటుచేసుకున్నాయి. జంబ్లింగ్ పద్ధతిలో ఈ కళాశాల విద్యార్థులను మరో కళాశాలలో, మరో కళాశాల విద్యార్థులను ఈ కళాశాలలో కేటాయించారు. దీనిపై గతంలో యూనివర్సిటీకి ఫిర్యాదులు సైతం అందాయి. పరీక్షలకు సంబంధించి 1, 3, 5వ సెమిస్టర్ హాల్‌టికెట్స్ కళాశాలలకు చేరాయి. యూనివర్సిటీకి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించని కళాశాలల నుంచి డిసెంబర్ 10వ తేదీలోగా చెల్లించాలని అండర్‌టేకింగ్ తీసుకుని హాల్‌టికెట్స్, పరీక్షల సామగ్రి విడుదల చేశారు.

# సోలార్ విద్యుత్‌ను నిల్వ ఉంచడమే లక్ష్యం : సీఎండీ



కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 26 : సోలార్ విద్యుత్ వినియోగం, పొదుపు చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ మరో వినూత్న ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. మందమర్రి సోలార్‌ప్లాంట్‌లో పగటిపూట ఉత్పత్తి జరిగి వినియోగం తర్వాత ఇంకా మిగిలిన సోలార్ విద్యుత్‌ను వృథాగా పోనీయకుండా బ్యాటరీలో నిల్వ చేసే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను పైలెట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తోంది. సంస్థ సీఎండీ బలరాం ఈ వినూత్న పద్ధతికి సంబంధించిన వివరాలను మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్న ఒక మెగా వాట్ నిల్వ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ పద్ధతి వల్ల నెలకు రూ.13 లక్షల వరకు నిల్వ ఉంటుందని, దీని ద్వారా రూ.1.6 కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు విజయవంతం అయితే మరో రెండు మెగావాట్ల సామర్థ్యం కలిగిన సిస్టమ్‌లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నామన్నారు.

# 20 రోజులైనా బస్తా ధాన్యం కొనలే..

- పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కొర్రీలు, నిబంధనలతో అటువైపు వెళ్లని రైతులు
- దళారులకు విక్రయించి మోసపోతున్న అన్నదాతలు
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు



అధ్వానంగా ఉన్న భూమిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

చండ్రుగొండ, నవంబర్ 26 : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. దాదాపు 20 రోజులు గడిచినా బస్తా ధాన్యం కొనుగోలు చేయకపోవడం.. నిబంధనలు, తేమ శాతం అంటూ కొర్రీలు పెడుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక అవసరాల కోసం దళారులకు ధాన్యం విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. మండలంలోని మద్దుకూరు, దామరచర్ల, తిప్పనపల్లి, పోకలగూడెం, తుంగారం, రావికంపాడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఈ నెల 5వ తేదీన అధికారులు ప్రారంభించారు. గుంపెన, గానుగపాడు సహకార సంఘాల ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అట్టహాసంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. కొనుగోళ్లు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని అధికారులు చెబుతున్నా.. కేంద్రాల్లో పెట్టే నిబంధనలతో రైతులు అటువైపు కూడా వెళ్లడం లేదు. దీనికి ప్రధాన కారణం.. తేమ శాతం 17 శాతం ఉండాలని, తూర్పార పట్టడం, ఆరబెట్టడం, గింజ నాణ్యత ప్రకారం ఉండటం, రైతులు పట్టదారు పాస్ పుస్తకం కలిగి ఉండటం వంటి నిబంధనలు పెడుతుండడంతో చేసేది లేక రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో కొనేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

**కనీస సౌకర్యాలు కరువు**

దామరచర్ల గ్రామంలో కనీస సౌకర్యాలు లేకుండా, బోర్డు, టెంటు లేకుండా అధ్వానంగా ఉన్న భూమిలో కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ధాన్యాన్ని కుప్పలుగా పోసేందుకు, కాంటాలు వేసేందుకు కూడా అక్కడి భూమి చదునుగా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయలేదు. ఇక మద్దుకూరు గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని కొనుగోలు కేంద్రంగా మార్చారు. దీనిపై క్రీడాకారులు, యువకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఉపయోగంగా, సౌకర్యవంతంగా ఉండే ప్రదేశంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**తేమ శాతం రాక కాంటాలు జరగట్లేదు..**

తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల కాంటాలు ఆలస్యమవుతున్నాయి. త్వరలోనే ధాన్యం కాంటాలు ప్రారంభిస్తాం. ఎప్పటికప్పుడు రైతుల వద్దకు వెళ్తున్నాం. పలుచగా ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచిస్తున్నాం. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి.

–వినయ్, మండల వ్యవసాయాధికారి